క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు



విశ్వకర్మకు పూజలు నిర్వహిస్తున్న కార్పెంటర్ యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: స్థానిక కర్రల మార్కెట్‌లో కార్పెంటర్ యూనియన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజా మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యూనియన్ నాయకులు ముక్కాముల శ్రీనివాసరావు, యడ్లపల్లి బ్రహ్మాజీ, గరుగు నాగరాజు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా స్వామివారిని ప్రతిష్ఠించి పూజాధికాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పెదగాడ శ్రీను, తామరాపల్లి అప్పలాచారి, పారోజు హరి, పొన్నాడ శ్రీను, సబ్బవరపు శ్రీను, వేముల ప్రకాష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



తొత్తడాంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను ఈనెల 23 లోగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.నీలిమ కోరారు. మండలంలోని తొత్తడాం గ్రామంలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట వేసిన ప్రతీ రైతు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. దీని వల్ల పంట బీమా సౌకర్యంతో పాటు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. పూసపాటిరేగ మండలంలో 50 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

విజయనగరం డీఎస్పీగా శ్రీనివాసరావు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం సబ్ డివిజన్ డీఎస్పీగా ఎం.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవాలకు యువత ఆకర్షితులు కాకుండా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులను చైతన్యపరిచాలని డీఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు.

బైక్‌పై ఎక్కించుకుని దోచేశాడు

విజయనగరం క్రైమ్: మద్యం సేవించి ఉన్న తనకు ఓ వ్యక్తి గంటస్తంభం వరకు లిఫ్ట్ ఇస్తానని బైక్ ఎక్కించుకుని సీఎంఆర్ వైపు తీసుకువెళ్లి తనపై దాడి చేసి తన వద్ద ఉన్న డబ్బులు దోచుకెళ్లిపోయాడని బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన నక్కాన లక్ష్మణరావు కూలి పనిచేస్తుంటాడు. ఎల్ఐసీ పాలసీ డబ్బులు రూ.50 వేలు కట్టేందుకు ఈ నెల 13న ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లాడు. పాలసీలో ఏవో తప్పులు ఉన్నాయని, ఏజెంట్‌ను కలిసి రావాలని అక్కడి అధికారులు చెప్పడంతో అక్కడ నుంచి కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. అక్కడ ఉన్న వైన్ షాపుకు వెళ్లి మద్యం సేవించాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఎక్కడకు వెళ్తున్నావని ప్రశ్నించగా, గంటస్తంభం వద్దకని చెప్పడంతో తాను అటువైపే వెళ్తున్నానని చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. గంటస్తంభం వైపు కాకుండా సీఎంఆర్ వైపు తీసుకువెళ్లి అక్కడ అతనిపై పిడిగుద్దులు గుద్ది అతని వద్ద ఉన్న రూ.50 వేలు పట్టుకుని పరారయ్యాడు. నాటి నుంచి వెతికినా ఎక్కడా కనపడకపోయేసరికి వన్‌టౌన్ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

నేడు ఇసుక వేలం

గుర్ల: అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు సీజ్ చేసిన 76.5 టన్నుల ఇసుకను స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ పి.నారాయణ రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తహసీల్దా ర్ సమక్షంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని సూచించారు.

ఊరూరా 'స్వచ్ఛతా హీ సేవా'



విజయనగరం: స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, మేయర్ విజయలక్ష్మి, తదితరులు



విజయనగరం రూరల్: జొన్నవలసలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

- ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు పరిశుభ్రం
- పెద్ద ఎత్తున పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు
- పరిశుభ్రత మనందరి జీవితంలో దినచర్యగా మారాలి: ఎమ్మెల్యే అదితి పిలుపు



విజయనగరం: కోనేరును శుభ్రపరుస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



విజయనగరం రూరల్: గుంకలాంలో రోడ్డును శుభ్రం చేస్తున్న నాయకులు, సచివాలయ సిబ్బంది



విజయనగరం ఫోర్ట్: తుప్పలను, చెత్తను తొలిగిస్తున్న ఐటీఐ విద్యార్థులు



పూసపాటిరేగ: ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ రాధిక, తహసీల్దార్ గోవింద, తదితరులు



నెల్లిమర్ల రూరల్: రామతీర్థం ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



నెల్లిమర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న నగర పంచాయతీ సిబ్బంది, నాయకులు



పూసపాటిరేగ: మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఊరురా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని చారిత్రక అయ్యకోనేరు శుద్ధి కార్యక్రమంతో జిల్లాలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, నగర మేయర్ వి.విజయలక్ష్మి ప్రారంభించారు. ఇరువురూ కలిసి స్వయంగా చెరువు పరిసరాలను పరిశుభ్రం చేశారు. నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, అధికారులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో చెరువులో పూడికలను తొలగించారు. అనంతరం సుమారు ఐదు వేల మంది మానవహారంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ నినాదాలు చేశారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి దైనందిన జీవనంలో భాగంగా చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని మేయర్ విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ కేశలి అప్పారావు, డీఈఓ ప్రేమ్ కుమార్, మెప్మా పీడీ సుధాకర్, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ అధ్యక్షుడు ప్రసాదరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు ఆరిశెట్టి నాగేశ్వరరావు, రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధి డా.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గుంకలాంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది గ్రామంలోని రోడ్లను శుభ్రం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్ టీవీ గిరి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు నగరంలోని బీసీ కాలనీ నుంచి గోకపేట రైల్వే ట్రాక్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల వ్యాధులు దరిచేరవని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిక్షణాధికారి జి.రామాచారి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం..

నెల్లిమర్ల రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఎన్నో అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండలంలోని రామతీర్థంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు వృద్ధి చెందడంతో ఎన్నో రోగాలు సంక్రమిస్తున్నాయని, వాటిని నిర్మూలించేందుకు కృషి చేద్దామన్నారు. అనంతరం స్వచ్ఛతే సేవపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో స్వచ్ఛతా హీ ర్యాలీ..

నెల్లిమర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి రామతీర్థం జంక్షన్ వరకు 'స్వచ్ఛతా హి సేవా' ర్యాలీ మంగళవారం నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, మెప్మా సీఎంఎం డి.గోవిందరావు, బి.పోలినాయుడు, ప్రజాప్రతినిధులు లెంక అప్పలనాయుడు, రవ్వా నాని, బంగారు శంకరరావు, సచివాలయ కార్యదర్శులు, మెప్మా ఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలి

పూసపాటిరేగ: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం.రాధిక పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అక్టోబరు 1 వరకు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, మహంతి చిన్నంనాయుడు, ఎంపీజీ శంకరరావు, పిన్నింటి సన్యాసినాయుడు, మహంతి శివ, బూర్లె శ్రీధర్, పీడీఏ ప్రసాద్, టొంపల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: వరి సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని శాస్త్రవేత్త తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని చంద్రంపేటలో రైతులకు యంత్రంతో వరి వెద సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులతో పాటు కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా ఎకరాకు సుమారు రూ.6వేల వరకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ దేవుడుబాబు, వీఏఏ వేణుబాబు, సిబ్బంది రమేష్, శ్రీనివాసరావు, రాంబాబు, రైతు మిత్రలు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వకుండా ఆ బాధ్యత మాకెందుకు..?



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనరసమ్మ



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

- జలజీవన్ పథకం నిర్వహణపై అధికారులను ప్రశ్నించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు
- దేవరపొదిలాంలో ఉన్నత పాఠశాల లేకుండా చేశారు
- గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులనే మంజూరు చేయాలి
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

చీపురుపల్లి: 'కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి జలజీవన్ పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆ పథకం నిర్వహణ బాధ్యతలు ఎవరు చూస్తారో అర్థం కావడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పథకం నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లదే అంటే తమకేం సంబంధం' అంటూ మండల సర్వసభ్య సమా వేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళ న వ్యక్తం చేశారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో గొల్లలములగాం సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు, నిమ్మలవలస, మెట్టపల్లి ఎంపీటీసీలు అధికార్ల శ్రీనుబాబు, మీసాల ఈశ్వరరావు మాట్లాడుతూ జలజీవన్ పథకానికి సంబంధించి పైపులు, కుళాయిలు, మోటార్లు పాడైతే వాటికి మరమ్మతులు చేయించడం ఎలా అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఈ పథకం నిర్వహణ కోసం సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, రోజూ ఇంటికి రూపాయి వసూలు చేసి ఆ డబ్బులతో పథకం నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లే చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామకృష్ణ తెలిపారు. దీనికి సర్పంచ్‌లు స్పందిస్తూ నిధులు లేకుండా ప్రజల నుంచి వసూళ్లు చేసే బాధ్యతలు తమకొద్దన్నా రు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ కార్యదర్శుల ద్వారా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవరపొదిలాం గ్రామానికి గత ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంజూరు చేస్తే, కూటమి ప్రభుత్వం ఆ పాఠశాలను లేకుండా చేసిందని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో అక్కడున్న విద్యార్థులు అంతా టీసీలు తీసుకుని వెళ్లిపో యా రని నిమ్మలవలస ఎంపీటీసీ అధికార్ల శ్రీనుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. చీపురుపల్లి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోయి మలుపుల వద్ద రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే జంగిల్ క్లియరన్స్ పనులు చేయించాలని అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాథ్ కోరారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ప్రతిపాదించిన పనులు మంజూరవుతాయో లేదో ఉపాధి హామీ అధికారులు స్పష్టత ఇవ్వాలని, గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులనే మంజూరు చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీపీ వెంకటనరసమ్మ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన అంశాలపై మినిట్స్ సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజుకు సూచించా రు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఉప సర్పంచ్ కరిమజ్జి వెంకటరమణమ్మ, తహసీల్దార్ ఎస్.రాజారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక అశోక్ నగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు మంగళవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్‌నగర్‌లోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో అందరూ నిద్రపోతున్న సమయంలో ఓ దొంగ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను పట్టుకుపోయాడు. ఆ సమయంలో చిన్న శబ్దం రావడంతో ఇంట్లోని వారు లేచి చూసేసరికి దొంగ పరుగులు తీశాడు. బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ ఎస్సై మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత న్యాయ సహకార అవగాహన సదస్సు

విజయనగరం క్రైమ్: అలియన్స్ డిఫెండింగ్ ఫ్రీడమ్ ఆఫ్ లైఫ్ అండ్ లిబర్టీ(ఏడీఎఫ్) ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహకార అవగాహన సదస్సు బుధవారం నిర్వహించనున్నట్లు సిమ్స్ బాప్టిస్ట్ చర్చి సంఘమిత్ర డాక్టర్ ఆర్ఎస్ జాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల క్రైస్తవ పెద్దలకు, నాయకులకు, క్రైస్తవ సమాజ కార్యకర్తలకు, క్రైస్తవ న్యాయవాదులకు, సంఘ కాపరులకు, క్రైస్తవ మత బోధకులకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఢిల్లీ నుంచి సిస్టర్ అనుశ్రీ బెనార్డ్, సిస్టర్ ఇవా ల్యాన్స్ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో సదస్సు ఉంటుందన్నారు. క్రైస్తవ సోదరులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఈ-క్రాప్, ఈకేవైసీ శతశాతం పూర్తిచేయాలి



ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు

జామి: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయడంతో పాటు ఈకేవైసీ ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవాకేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి ఈ- క్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీలోగా రైతులు ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. .ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేసుకోకపోతే ప్రకృతి వైపరీత్యాలకు పంటదెబ్బతింటే నష్టపరిహారం రాదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించు కునే అవకాశం ఉండదన్నారు. ఆయన వెంట ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు



ఆలయంలో చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, తాతా రాజేష్ శర్మ, శంబరి కృష్ణలు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు నిర్వహించారు. విశాఖపట్నంలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన ఆధ్యాత్మిక నృత్యకళాప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఆలయఈఓ డీవీవీ.ప్రసాదరావు ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరదబాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాల సేకరణకు ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

కొత్తవలస: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తుమ్మికాపల్లిలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు మంగళవారం విరాళాలు సేకరిం చారు. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, ఇళ్లకు విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీగా వెళ్లి రూ. 54,490 సేకరించారు. ఈ నిధికి కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది తమ వంతుసాయం జత చేసి సీఎం సహాయనిధికి పంపిస్తామని కళాశాల కరస్పాండెంట్ కె.మహే శ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.ఏ.కుమార్‌బాబు పాల్గొన్నారు.

ఆస్పత్రికి గీజర్ల అందజేత

శృంగవరపుకోట: కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్ రూ.60,000తో రెండు వాటర్ గీజర్లను స్థానిక ప్రభుత్వాస్పత్రికి సమకూర్చారు. వీటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఆస్పత్రిని సందర్శించినప్పుడు వేడినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని బాలింతలు, గర్భిణులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు.ఈ విషయం గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌కు చెప్పడంతో ఆయన రెండు గీజర్లను ఆస్పత్రికి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.